## ఏపీ పీజీఈసెట్ ఫలితాల్లో జిల్లాకు ర్యాంకుల పంట

**పుట్టపర్తి, జూన్ 18(ఆంధ్రజ్యోతి):** ఎస్వీయూ నిర్వహించిన ఏపీ పీజీఈ సెట్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. వివిధ విభాగాల్లో ఐదుగురు జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో కదిరిలోని అడపాల వీధికి చెందిన విద్యాధరి షరూఫ్ 8, సివిల్ ఇంజనీంగ్‌లో నల్లమాడకు చెందిన సుదర్శన్ 13, కెమికల్ ఇంజనీరింగ్‌లో బత్తలపల్లి మండలం గంటాపురానికి చెందిన రాజవర్దన్ నాయుడు 9, మెకానికల్ ఇంజనీరింగ్‌లో పెనుకొండ మండలం సత్తార్‌పల్లికి చెందిన అక్షయ 7, ఫార్మసీ విభాగంలో హిందూపురానికి చెందిన గణేష్‌సాయి 7వ ర్యాంకు సాధించారు.

# సత్యన్నకు ఘనస్వాగతం

- అడుగడుగునా పూలవర్షం
- హారతులు, గజమాలలతో స్వాగతాలు
- యర్రాయపల్లి నుంచి ధర్మవరం వరకు జనసందోహం
- దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



బత్తలపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్





యర్రాయపల్లి వద్ద మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న కూటమి శ్రేణులు



మంత్రి సత్యకుమార్‌కు గజమాలతో స్వాగతం

## మంత్రి హోదాలో తొలిసారి ధర్మవరానికి సత్యకుమార్

**ధర్మవరం, జూన్ 18:** వైద్యఆరోగ్య సంక్షేమం, వైద్యవిద్య శాఖల మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు మంగళవారం ఘనస్వాగతం పలికారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత సత్యకుమార్ యాదవ్ తొలిసారి ధర్మవరం వచ్చారు. నియోజకవర్గ పరిధిలోకి రాగానే మంత్రికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి బొకేలు ఇచ్చి, స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఓపెన్‌టాప్ వాహనంలో ర్యాలీగా బయల్దేరారు. ర్యాలీ సాయంత్రం 6 గంటల వరకు సాగిందంటే అభిమానుల కోలాహలం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. బత్తలపల్లి మండలం యర్రాయపల్లి నుంచి ర్యాలీ ప్రారంభమైంది. అక్కడి నుంచి బత్తలపల్లికి చేరుకుంది. అడుగడుగునా కూటమి శ్రేణులు.. భారీ గజమాలలతో సత్కరించారు. మరికొందరు పుష్పగుచ్చాలు అందజేయగా, మహిళలు హారతులు పట్టారు. కూటమి శ్రేణులు అడుగడుగునా బాణసంచా కాల్చి, హర్షం వ్యక్తం చేశారు. బత్తలపల్లికి రాగానే క్రేన్, గజమాలతో సత్కరించారు. పోట్లమర్రి, వేల్పుమడుగు, గొట్లూరు, మార్కెట్‌యార్డు, మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ గజమాలలతో స్వాగతం పలికారు. యువకులు డ్యాన్సులు, కర్రసాము, కీలుగుర్రాల ఆట ప్రదర్శించారు. డీజేలతో పట్టణమంతా దద్దరిల్లింది. అనంతరం కదిరి గేటుకు చేరుకుని, చేనేత విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడి నుంచి దిమ్మెల సెంటర్, తేరుబజారు మీదుగా దుర్గమ్మ ఆలయానికి చేరుకున్నారు. చక్రవర్తి థియేటర్ వద్ద మంత్రి కేక్ కట్ చేశారు. సమీపంలోని దుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అక్కడి నుంచి కళాజ్యోతికి చేరుకుని, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. దుర్గానగర్ ఎదురుగా నూతనంగా నిర్మించిన ప్రభుత్వాస్పత్రికి చేరుకుని, ఆవరణలో మొక్కలు నాటారు.

### ధర్మవరం నేలకు సాష్టాంగ నమస్కారం

ర్యాలీ ధర్మవరంలోని కదిరి గేటు వద్దగల చేనేత విగ్రహం వద్దకు చేరుకోగానే సత్యకుమార్‌యాదవ్ నేలపై సాష్టాంగ నమస్కారం చేసి, మట్టిని తీసుకుని, నుదుటిపై పెట్టుకున్నారు. ధర్మవరం పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. దీంతో అక్కడున్న అభిమానులు, కూటమి శ్రేణులు ఆశ్చర్యపోయారు.

# దంచికొట్టిన వాన



మడకశిరలోని అమరాపురం రోడ్డులో నిలిచిన వర్షపునీరు

**పుట్టపర్తి రూరల్, జూన్ 18:** జిల్లావ్యాప్తంగా మంగళవారం సాయంత్రం వాన దంచికొట్టింది. మడకశిరలో ఏకధాటిగా రెండు గంటలపాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. హిందూపురంలో కూడా భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమై, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలు చెక్‌డ్యాంలు నిండాయి. చెరువులకు నీరు చేరింది. సోమ, మంగళవారాల్లో రెండ్రోజులు వర్షం కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ విత్తన సాగుకు అనుకూలమని చెబుతున్నారు. ఈ వర్షాలతో జిల్లాలో విత్తన సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయని వ్యవసాయ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

### సోమవారం రాత్రి పలుచోట్ల వర్షం

జిల్లాలో పలుచోట్ల సోమవారం రాత్రి భారీవర్షం కురిసింది. అత్యధికంగా నంబులపూలకుంట మండలంలో 68.6 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటనలో తెలిపారు. అమడగూరు 63.8, నల్లచెరువు 58.0, హిందూపురం 54.6, లేపాక్షి 36.4, చిలమత్తూరు 32.6, కదిరి 26.8, ఓబుళదేవరచెరువు 24.4, తనకల్లు 20.6, తాడిమర్రి 16.6, గాండ్లపెంట 11.2, పరిగి 6.2, మడకశిర 4.4, గోరంట్ల 4.2, తలుపుల 2.4, ముదిగుబ్బలో 1.2 మిమీ వర్షం కురిసినట్లు వారు వెల్లడించారు.

# పీఎం కిసాన్ నిధులు జమ

**జిల్లాలో 2.52 లక్షలమంది రైతులకు లబ్ధి**

**పుట్టపర్తి రూరల్, జూన్ 18:** జిల్లాలో అన్నదాతలకు పీఎం కిసాన్ నిధులు జమయ్యాయి. ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి యోజన పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతన్నలకు పెట్టుబడి సాయం అందజేస్తోంది. అందులో భాగంగా 17వ విడత సొమ్మును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసి నుంచి విడుదల చేశారు. ఇందులో బాగంగా జిల్లాలో 2.52 లక్షల మంది రైతులకు రూ.50.44 లక్షల లబ్ధి చేకూరనుంది.

# జోరుగా పైరవీలు!

## బదిలీల కోసం నేతల చుట్టూ పోలీసుల ప్రదక్షిణ

- లెటర్ల కోసం తీవ్ర ప్రయత్నాలు
- గెలిచిన వెంటనే మాటిచ్చిన ఎమ్మెల్యేలు
- పోలీసు, రెవెన్యూ అధికారుల బదిలీలకు రంగం సిద్ధం
- వచ్చేవారంలో ఉంటాయంటూ ప్రచారం

**హిందూపురం, జూన్ 18:**

ఎన్నికల ప్రక్రియ ముగిసింది. కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. జిల్లాలో పోలీసు బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాలకపక్షం మారినపుడు బదిలీల వరుసలో పోలీసులే ముందు ఉండటం ఆనవాయితీ. జిల్లా కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లు తదితర అధికారుల బదిలీలు వెనువెంటనే నిర్వహిస్తారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పోలీసు, రెవెన్యూ అధికారుల బదిలీలు త్వరలోనే చేపట్టనున్నట్లు తెలుస్తోంది. వైసీపీ హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సిఫార్సులతో వచ్చినవారు ప్రస్తుతం కొనసాగుతున్నారు. జిల్లాలో ఎన్నికలకు ముందు వచ్చిన పోలీసు, రెవెన్యూ అధికారులు సింహభాగం అప్పటి మంత్రి పెద్దిరెడ్డి పంపినవారే. ఎన్నికల్లో పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకునే యోచనలో ఆయనకు అత్యంత సన్నిహితంగా మెలగిన వారినే జిల్లాకు పంపారు. అయినా వైసీపీపై ప్రజల్లో గూడుకట్టుకున్న వ్యతిరేకత కారణంగా ఆ పార్టీ ఘోరపరాజయం పాలైంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇక ఎన్నికల ముందు వచ్చి వైసీపీకి వీరవిధేయులుగా పనిచేసిన కొంతమంది అధికారులను సాగనంపడానికి ప్రస్తుత ఎమ్మెల్యేలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో కొంతమంది వైసీపీకి అనుకూలంగా ఉంటూనే టీడీపీ నాయకులతో సఖ్యతగా ఉన్నారు. మరికొంతమంది టీడీపీ నాయకుల పట్ల కఠినంగా వ్యవహరించారనే విమర్శలున్నాయి. అలాంటి అధికారులను తొందరగా సాగనంపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.



### లెటర్ల కోసం ప్రయత్నాలు

పోలీసు, రెవెన్యూ అధికారులు కొన్నిచోట్ల మంత్రులు, ఎమ్మెల్యే సిఫార్సు లేఖల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కొంతమంది పోలీసు అధికారులైతే సెలవుపెట్టి మరీ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. విజయవాడలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి సిఫార్సు లేఖలు ఇవ్వాలని కోరుతున్నారు. మహిళా ఎమ్మెల్యేలున్న చోట వారి కుటుంబ సభ్యుల ద్వారా లేఖల కోసం ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో మాట్లాడుతూ ఎలాగైనా సిఫార్సు లేఖలు కావాలంటూ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

### గెలిచిన వెంటనే అభయం

సర్వేల ఆధారంగా కూటమి ప్రభుత్వం వస్తుందని ముందుగానే అంచనాకు వచ్చిన కొందరు అధికారులు ఎన్నికలకు ముదే టీడీపీ తరఫున బరిలో ఉన్న అభ్యర్థుల నుంచి మాట తీసుకున్నారు. కొన్నిచోట్ల కౌంటింగ్ కేంద్ర వద్దే ఆశీర్వాదం తీసుకున్నట్లు సమాచారం. కొంతమంది ఎమ్మెల్యేలు గెలిచిన సంతోషంలో కొందరికి మాటిచ్చేశారు. కింది స్థాయి నాయకుల ఒత్తిళ్ల కారణంగా వారికి మరోచోటికి వెళ్లాలను చెప్పుకొస్తున్నారు. మరికొంతమంది గెలిచినప్పటి నుంచి అధికార పార్టీకి వీరవిధేయులుగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. అలా చేస్తే తమకు అనుకూలంగా ఆలోచిస్తారని భావిస్తున్నట్లు సమాచారం.

### కొత్తవారు రాకముందే..

జిల్లాలోని పోలీసు శాఖలో కొత్తవారు రాకముందే ఏదో ఒక ప్రాంతానికి వెళ్లాలని ప్రస్తుతం ఉన్న పోలీసు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. గతంలో వారు పనిచేసిన ప్రాంతాల్లో పరిచయం ఉన్న ప్రస్తుత అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నట్లు తెలిసింది. గతంలో వారు చేసిన పనులను గుర్తు చేసే ఒక్క అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను కోరుతున్నట్లు సమాచారం. ఏయే ప్రాంతాల్లో ఎవరెవరు గెలిచారో వివరాలు తెలుసుకుని, వారికి అనుకూలంగా ఉన్న నేతల చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వంలో లూప్‌లైన్‌లో ఉన్న అధికారులు, ఇబ్బందులు పడిన వారు జిల్లాకి రావడానికి అధికార పార్టీ నాయకులకు టచ్‌లోకి వచ్చినట్లు తెలిసింది. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలను కలిసివెళ్లినట్లు సమాచారం.




### వచ్చేవారంలో బదిలీలు..?

వచ్చేవారంలో అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఆలోపే జిల్లాస్థాయి, సబ్‌డివిజన్ అధికారులను బదిలీ చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయా జిల్లాలకు చెందిన అధికారులు లిస్టు సీఎంఓకి పంపినట్లు తెలుస్తోంది. జిల్లాలో ఓ పోలీసు ఉన్నతాధికారి బదిలీ కానున్నట్లు సమాచారం. ఆయన 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో సబ్‌డివిజన్ అధికారిగా పనిచేశారు. దాంతో పక్క జిల్లాకు వెళ్లనున్నట్లు సమాచారం. ఆ స్థానానికి గతంలో ఇదే జిల్లాలో సబ్‌డివిజనల్ స్థాయిలో పనిచేసిన అధికారి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మహిళా అధికారి కూడా రేసులో ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఓ అధికారికి జిల్లాలోని ఓ కీలక ప్రజాప్రతినిధి ఆశీస్సులు పుష్కలంగా ఉండటంతోపాటు టీడీపీ హయాంలో ఉన్న సత్సంబంధాల నేపథ్యంలో జిల్లాకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని పోలీసు శాఖలో చర్చించుకుంటున్నారు. మహిళా అధికారికి కూడా పైస్థాయిలో ఆశీస్సులు ఉండడంతో ఆమె వచ్చే అవకాశాలు లేకపోలేదని చెప్పుకుంటున్నారు. ఏదిఏమైనా కొంతమంది అధికారులు బదిలీ కోసం పైరవీలు ప్రారంభించారు.



- నష్టాల పంట
- ఖరీఫ్, రబీలో పెట్టుబడి మట్టిపాలు
- అప్పుల ఊబిలో రైతన్న
- సాగుకు వెనకడుగు
- పొరుగు రాష్ట్రానికి వలసబాట
- ప్రోత్సాహమివ్వని ప్రభుత్వం
- ఐదేళ్లలో పెరిగిన అన్నదాత ఆత్మహత్యలు
- వ్యవసాయానికి విపత్తు
- నేడు కేంద్ర కరువు బృందం పర్యటన
- కరువు రైతుపై కరుణ చూపేనా?



# కన్నీటిధార..!

## కరువు నేలలో అప్పుల సేద్యం

**పుట్టపర్తి, జూన్18(ఆంధ్రజ్యోతి):** కరువు రైతు ఏటా అప్పుల సేద్యం చేస్తున్నాడు. నష్టాల పంట పండిస్తున్నాడు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. వాటిని తీర్చే మార్గంలేక కొందరు ఆత్మహత్యలు చేసుకుంటుంటున్నారు. మరికొందరు భార్యాబిడ్డలతో పరాయి రాష్ట్రాలకు పొట్ట చేతపట్టుకుని వలస వెళ్తున్నారు. గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావంతో పంటలు చేతికి రాకపోగా.. రబీ అప్పుల ఊబిలోకి నెట్టింది. ఐదేళ్లుగా అతివృష్టి, అనావృష్టితో వరుసగా పంటలు చేతికిరాక రైతన్నలకు పెట్టుబడులు కూడా దక్కట్లేదు. అప్పులు మూటగట్టుకున్నారు. భూమినే నమ్ముకున్న రైతు జీవనం భారంగా మారింది. వరుస కరువులతో రైతు కుటుంబాలతోపాటు వ్యవసాయ రంగంపై ఆధారపడిన పల్లె, పట్నం జనం వలసలు కట్టారు. ఈ పరిస్థితులు జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడిన రైతన్నను ఆందోళనలోకి నెట్టేస్తోంది. జిల్లాలో ఏటా ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3.23 లక్షల హెక్టార్లు. గతేడాది ఖరీఫ్ సాగు ప్రారంభం నుంచే వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటల సాగు చతికిలపడింది. పంటలు పూర్తిగా ఎండిపోయి, అన్నదాతలు సర్వం నష్టపోయారు. అయినా.. అప్పోసోప్పో చేసి రబీలో పంటలు పెట్టారు. తీరా చేతికొచ్చే సమయానికి తడిలేక పలు పంటలు ఎండిపోయి, పొలంలోనే వదిలేసే పరిస్థితులు దాపురించాయి. కూలీల ఖర్చులు కూడా దక్కక రైతన్న పెట్టుబడి మట్టిపాలైంది. రబీలో జిల్లా అంతటా తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నా.. ప్రభుత్వం ఒకే మండలంలో తీవ్ర కరువు అని ప్రకటించి, 31 మండలాలకు మొండిచేయి చూపింది. ఈనేపథ్యంలో వరుసగా ఖరీఫ్, రబీలో రుణభారం కూడగట్టుకున్న రైతన్న ఉపాధి కోసం వలసబాటపట్టారు. జిల్లాలో కరువును పరిశీలించేందుకు బుధవారం కేంద్ర బృందం వస్తోంది. కరువు రైతుపై ఏమేరకు కనికరం చూపుతారోనన్న చర్చ సాగుతోంది.



ఖరీఫ్‌లో నంబులపూలకుంట మండలంలో ఎండిపోయిన వేరుశనగ పంట (ఫైల్)

### సాగుకు విపత్తు


జిల్లాలో వర్షాధారంగా వివిధ పంటలు సాగు చేస్తున్నారు. గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం వెంటాడి అన్ని మండలాల్లో వర్షాధార వేరుశనగ తదితర అన్ని పంటలు ఎండిపోయాయి. అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. చాలాచోట్ల పశుగ్రాసం సైతం దక్కలేదు. వేల కోట్ల రూపాయల రైతు పెట్టుబడి మట్టిలో కలిసిపోయింది. గత ఖరీఫ్‌లో జిల్లాలో ఏడు తీవ్ర, 14 మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించింది. 11 మండలాలకు మొండిచేయి చూపింది. జిల్లాలో 1,17,005 మంది రైతులకు రూ.105.03 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుంది. ఐదేళ్లుగా పంటల పండక రుణభారం పెరిగిపోయి, పలువురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఖరీఫ్‌లో వర్షాభావం రైతున్నను వెంటాడగా.. రబీలోనైనా రుణభారం నుంచి గట్టెక్కుతామని భావించిన అన్నదాతకు నిరాశే ఎదురైంది. ఈశాన్య రుతుపవనాలు బలహీన పడడంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. భూగర్భజలమట్టం పడిపోయి, బోరుబావులు వట్టిపోయి, పంటలు ఎండిపోయాయి. దీంతో రైతన్నకు మళ్లీ అప్పులే మిగిలాయి. జిల్లావ్యాప్తంగా రబీలో 28,192 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేయగా.. వర్షాభావంతో అన్నిచోట్లా దెబ్బతిన్నాయి. చాలాచోట్ల చేతికొచ్చే సమయంలో నష్టపోయారు. 2023-24లో రబీ సీజన్‌లో జిల్లా అంతటా కరువుచాయలు అలముకున్నా.. రొద్దం మండలాన్ని మాత్రమే తీవ్ర కరువు ప్రాంతంగా ప్రకటించారు. అదికూడా పప్పుశనగ పంట మాత్రమే దెబ్బతిన్నట్లు వైసీపీ ప్రభుత్వం ప్రకటించి, అన్నదాతకు తీవ్ర అన్యాయం చేసింది.

### నేడు కేంద్ర కరువు బృందం పర్యటన

జిల్లాలో 2023-24 రబీ సాగులో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని అందుకునేందుకు జిల్లాలో కేంద్ర కరువు బృందం బుధవారం జిల్లాకు రానుంది. రొద్దం మండలం ఆర్ కొట్టాలలో పర్యటించనుంది. ఆర్ కొట్టాల, చెరుకూరు పుప్పుశనగ రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననుంది. కేంద్ర కరువు బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు పుప్పుశనగ పంట లేదు. దీంతో జిల్లా అధికార యంత్రాగం.. ప్రభుత్వానికి పంపిన నివేదికపై కరువు బృందం అధ్యయనం చేసి, రైతుల ద్వారా కరువు పరిస్థితులను తెలుసుకోనుంది.

### వెంటాడుతున్న కరువు

జిల్లాలో ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం 3.23 లక్షల హెక్టార్లు కాగా.. గతేడాది 1,14,076 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 2,05,601 హెక్టార్లకుగాను 64,978 హెక్టార్లలో మాత్రమే పంట పెట్టడం గమనార్హం. మిగతా పంటలదీ అదే పరిస్థితి. అరకొర పదునులో అప్పోసొప్పో చేసి రూ.వేల కోట్ల పెట్టుబడులు పెట్టి రైతన్న విత్తనం వేశాడు. తీరా పంటచేతికొచ్చే సమయానికి వరుణదేవుడు కరుణించలేదు. ఫలితంగా పంటలు ఎండిపోయి, పొలంలోనే వదిలేసే పరిస్థితులు దాపురించాయి. కనీసం కూలీ ఖర్చులు కూడా రాలేదు. జిల్లా అంతటా తీవ్రంగా నష్టపోతే గతేడాది డిసెంబర్‌లో పర్యటించిన కేంద్ర కరువు బృందం కేవలం 73,566 హెక్టార్లలో వేరుశనగ, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు నివేదికలిచ్చింది. ఆ మేరకు కంటితుడుపుగా పరిహారం ఇచ్చారు. జిల్లాలో 32 మండలాల్లో ఖరీఫ్‌లో వర్షధారంగా సాగుచేసిన పంటలు 90 శాతంపైగా చేతికిరాలేదని యంత్రాంగం.. ప్రభుత్వానికి నివేదిక పంపింది. రూ.500 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు అంచనా వేసింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం రూ.105.03 కోట్లు మాత్రం పరిహారం విడుదల చేసింది. అదికూడా చాలామంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. రబీలో జిల్లావ్యాప్తంగా వివిధ పంటలు సాగు చేశారు, రొద్దం మండలంలో 503 మంది 656.92 హెక్టార్లలో సాగుచేసిన పప్పుశనగ పంట మాత్రమే దెబ్బతిన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. రూ.65.60 లక్షలు పరిహారం అందించాలని అందులో ప్రతిపాదించడం శోచనీయం. మిగతా మండలాల్లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతుల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. వరుసగా రెండేళ్లపాటు రైతన్నను కరువు వెంటాడడంతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. జిల్లాలో మడకశిర, కదిరి, హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం రైతులు, రైతుకూలీలు కర్ణాటక రాష్ట్రానికి వలసలు కట్టారు. ఇలా లక్షల మంది పొరుగు రాష్ట్రానికి పరుగులు పెడుతున్నారు. కరువు నివారణ దిశగా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం కూడా సక్రమంగా అమలుకావట్లేదన్న విమర్శలున్నాయి. బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా రైతుకు వలస తప్పట్లేదు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువవడంతో జిల్లాలో వ్యవసాయానికే విపత్తు ఏర్పడింది. గత ఖరీఫ్‌లో ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో ప్రత్యేకించి చేపట్టిన పనులు, నిధుల విడుదల ఎక్కడా కన్పించలేదు.



# అధ్వానంగా ఆసుపత్రి



- అగిన పునరుద్ధరణ పనులు
- కొన్ని మందులు బయట తెచ్చుకోవాల్సిందే
- అందుబాటులోలేని బాత్‌రూములు
- వాష్ రూముల్లేక సిబ్బందికీ ఇబ్బందే
- యూరిన్ కంటెయినర్లకూ కటకటే
- పట్టిపీడిస్తున్న పారిశుధ్య సమస్య

**గుంతకల్లు, జూన్ 18:** పట్టణంలోని రాయ్‌సాహెబ్ మిడతల హంపయ్య ఏరియా ఆసుపత్రిలో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి పెద్దదేకానీ.. అవసరానికి కొన్ని మందులు, పరికరాలు ఉండక పోవడంతో రోగులు బయటనుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఆసుపత్రి పాత భవనంలో పాక్షిక పునరుద్ధరణ పనులు జరుగు తుండడంతో బాత్‌రూములను మూసేశారు. దీంతో రోగులతో పాటు ఇక్కడ పనిచేసే సిబ్బంది, వైద్యులు వాష్ రోములు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో అవసరానికి కొన్ని మందులు దొరకడం లేదని, పరికరాలను కూడా బయట కొని తెచ్చుకోవలసి వస్తోందని రోగులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి వద్ద పారిశుధ్య నిర్వాహణ లేకపోవడంతో దుర్వాసన రాజ్యమేలుతోంది.



మూతపడిన వాష్ రూములు



గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి



ఆసుపత్రి గదుల బయట పోగుపడ్డ చెత్త

### ఎక్కడి పనులు అక్కడే..

ఆసుపత్రి పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతు పనులను గత సంవత్సరం చేపట్టారు. అయితే చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశాడు. దీంతో పాత భవనంలో రోగుల కోసం ఏర్పాటుచేసిన బాత్‌రూములు, టాయి లెట్లు మూతపడ్డాయి. ఈ కారణంగా వాష్ రూములు లేకపోవడంతో రోగులు, వైద్యులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కొందరు దూరంగా వెళ్లలేక బయటనే ఉన్న కాల్వల్లో మూత్ర విసర్జన చేస్తున్నారు. ఆసుపత్రి కాల్వల్లో మురుగు నిలిచిపోయింది, ఆసుపత్రి పక్కనే చెత్తను కుప్పగా పోశారు. పై అంతస్తుకు వెళ్లే మెట్ల పక్కన పాత బెడ్లను డంప్ చేశారు. దీంతో ఆసుపత్రిలో పారిశుధ్య సమస్యతో పాటు దుర్వాసన వ్యాపించి రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

### మందులు, పరికరాలకు కొరత

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు రాసిచ్చే కొన్ని మందులు ఉండడం లేదు. వైద్య పరీక్షలకు సంబంధించి బాత్‌రూములలో యూరిన్ కంటెయినర్లను అందు బాటులో ఉంచడంలేదు. రక్తం అవసరమైన రోగుల బ్లడ్ శాంపిల్స్‌ను తీసి పంపాల్సిన ట్యూబులు లేవు. వాటిని రోగులు బయట నుంచి కొని తెచ్చుకోవాల్సిందే. ఆసుపత్రిలో పలు మందుల కొరత నెలకొంది. అడ్మిషన్‌లో ఉన్న రోగులకు బెడ్‌షీట్లను సరిగా మార్చడంలేదనే ఆరోపణలున్నాయి. రోగుల అవసరార్థం ఆసుపత్రికి స్వచ్ఛంద సంస్థలు బెడ్‌షీట్లను విరాళంగా ఇచ్చినా పరిస్థితిలో మార్పు ఉండటంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

### ఏ ఓపీ ఎక్కడ ఉందో...?

పాతభవనం పునరుద్ధరణ పనులు పూర్తికానందున కొన్ని ఓపీ గదులను మెటర్నరీ అవసరాల కోసం నిర్మించిన కొత్త భవనంలోకి మార్చారు. కానీ ఏ ఓపీ ఎక్కడ ఉందన్న గుర్తులు ఆసుపత్రిలో ఏర్పాటుచేయలేదు. దీంతో ఓపీ స్లిప్ తీసుకున్న రోగులు సంబంధిత వైద్యుల వద్దకు వెళ్లడానికి ఇబ్బందులుపడుతున్నారు. వెంటనే ఓపీ స్లిప్పులు రాసే చోటు నుంచి ఓపీ రూములకు వెళ్లే మార్గాన్ని చూపుతూ గుర్తులు, రూముల నెంబర్లు, వైద్య విభాగాల పేర్లను గోడలకు రాయాలని ఆసుపత్రికి వచ్చేవారు కోరుతున్నారు.



నిలిచి పోయిన రెన వేషన్ పనులు



మెట్ల పక్కన డంప్ చేసిన పాత బెడ్లు

### రోగులను కసురుకుంటున్నారు



రెండు రోజుల క్రితం కడుపునొప్పితో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాను. ఆసుపత్రిలో నర్సులు అసలు పట్టించుకోవడం లేదు.. ఏమడిగినా నర్సులు, ఎంఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌ఓలు కసురుకుంటున్నారు. కడుపు నొప్పి ఉంది సూది వేయాలని అడిగితే... ఇక్కడ సూదులు లేవు, బయట నుంచి తెచ్చుకోవాలని చెప్పారు. లేదంటే ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాలని నర్సులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేక ఇక్కడికి వస్తే సిబ్బంది పట్టించుకోవడం లేదు.

- కె. రామకృష్ణ, గుంతకల్లు

### మధ్యాహ్నం పూట అసలు పట్టించుకోరు



రెండు రోజుల క్రితం నా భార్యకు జర్వం వస్తే ఆసుపత్రిలో అడ్మిట్ చేశాను. మధ్యాహ్నం పూట నర్సులు అసలు పట్టించుకోరు. మందులు, సూదులు కావాలని అడిగితే కింద క్యాజు వాలిటీలో చూపించుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. రోగులకు ఉదయం ఒక సెలైన్ బాటిల్ పెడతారు. రాత్రి ఒక సూది మాత్రమే వేస్తున్నారు. సెలైన్ బాటిల్ అయిపోయిం దని నర్సును పిలిస్తే దాని వైర్‌ను లాక్ చెయ్యండి. ఆ మాత్రం తెలియదా.. వేరే సెలైన్ వచ్చేంత వరకూ ఉండలేరా? అంటూ కటువుగా మాట్లాడుతున్నారు. : మస్తాన్, పందికుంట

# ఉద్యమంలా మొక్కల పెంపకం

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, జూన్18:** జిల్లాలో మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలని ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. మండలంలోని కౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జపనీస్ టెక్నిక్ అయిన 'మియా వాకీ సైంటిఫిక్' పద్ధతిలో వివిధ నమూనాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. మొక్కలు నాటడడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా మనందరిపై ఉందన్నారు. జిల్లాలో నీటి సంరక్షణ, మెగా ప్లాంటేషన్ కార్యక్రమాలు, కళ్యాణదుర్గం, రాయదుర్గం నగర వనాల అభివృద్ధి గురించి మంత్రికి డీఎఫ్‌వో వినీత్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ షైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, టీడీపీ నాయకులు మల్లికార్జున, పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మంత్రి కేశవ్

# పీజీ ప్రవేశ పరీక్షల్లో సత్తా

## ఏడుగురికి రాష్ట్రస్థాయి పదిలోపు ర్యాంకులు

**అనంతపురం సెంట్రల్, జూన్ 18:** పీజీ కోర్సులలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. ఏకంగా ఏడుగురికి రాష్ట్రస్థాయిలో పదిలోపు ర్యాంకులు వచ్చాయి. వివిధ కోర్సులలో వీరు ఉత్తమ ర్యాంకులు సాధించారు. బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన రాజవర్ధన్ నాయుడు కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయి 9వ ర్యాంకును సాధించాడు. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అనంతపురం ఇందిరా నగర్‌కు చెందిన హరిత రెండో ర్యాంకును, గుంతకల్లు మండలం కసాపురం గ్రామానికి చెందిన ముకుందసాయి ఏడో ర్యాంకును, నల్లమాడకు చెందిన సుదర్శన్ 13వ ర్యాంకును సాధించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో కదిరికి చెందిన షఫ్రాన్ రాష్ట్రస్థాయి 8వ ర్యాంకును సాధించం విశేషం. ఈసీఈలో గుంతకల్లుకు చెందిన హర్షితకు 5వ ర్యాంకు, ఫుడ్ టెక్నాలజీలో అనంతపురం నగరానికి చెందిన విజేతకు 8వ ర్యాంకు వచ్చాయి. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పెనుకొండ మండలం సత్తారుపల్లికి చెందిన అక్షయ 7వ ర్యాంకును సాధించారు. ఫార్మసీ విభాగంలో కొత్తకోటకు చెందిన గణేష్ రాష్ట్రస్థాయి ఏడో ర్యాంకును సాధించాడు.



హరిత(సివిల్ 2వ ర్యాంకు)



విజేత(8వ ర్యాంకు

### హరితకు రెండో ర్యాంకు

జేఎన్‌టీయూలో ఇటీవల బీటెక్ సివిల్ ఇంజీరింగ్ పూర్తిచేసిన హరిత ఆ విభాగంలో పీజీ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్రస్థాయి రెండో ర్యాంకును సాధించడం విశేషం. హరిత తల్లి గృహిణి కాగా తండ్రి నీటిపారుదల శాఖ ఉద్యోగి. వారి ప్రోత్సాహంతో మంచి ర్యాంకు సాధించానని విద్యార్థి ఆనందాన్ని వ్యక్తంచేసింది. తెలంగాణ పీజీ సెట్‌లో ఫుడ్ టెక్నాలజీ కోర్సు ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థి విజేత, ఏపీ పీజీసెట్‌లో 8వ ర్యాంకును సాధించడం విశేషం. ఎంటెక్ పూర్తిచేసి ఉత్తమ ఇంజనీర్‌గా సేవలందించాలన్న లక్ష్యంతో పీజీసెట్‌లో మంచి ర్యాంకును పొందానని విజేత పేర్కొన్నారు.

# కేంద్ర బృందం పర్యటన షెడ్యూల్ ఖరారు

- నేడు రొద్దం, రేపు విడపనకల్లు, వజ్రకరూరులో..

**అనంతపురం అర్బన్, జూన్ 18 :** కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ బృందం జిల్లా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట దాకా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో వ్యవసాయ, అనుబంధ శాఖాధికారులతో ఒకటో, రెండో కరువు బృందం సభ్యులు సమావేశం కానున్నారు. ముందుగా గతేడాది రబీ సీజన్ పంటనష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. అనంతరం అక్కడే పంటనష్టంపై జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ బృందం సభ్యులకు వివరించనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల దాకా ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో భోజన విరామం తీసుకుంటారు. అక్కడి నుంచి ఒకటో బృందం టీం లీడర్ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ రితీష్ చౌహాన్, సభ్యులు పొన్నుస్వామి, సునీల్‌దుబేలు సభ్యులు సత్యసాయి జిల్లా రొద్దం మండలానికి వెళ్తారు. రెండో బృందం సభ్యులు కర్నూలు జిల్లాకు వెళతారు. రొద్దంలో ఒకటో బృందం సభ్యులు పర్యటన ముగించుకొని రాత్రికి అనంతపురం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బస చేస్తారు. 20వతేదీ ఉదయం 9.30 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి విడపనకల్లు మండలం మలాపురం గ్రామానికి వెళ్లి కరువు ప్రభావిత పొలాలను పరిశీలించడంతోపాటు స్థానిక రైతులతో ముఖాముఖిగా మాట్లాడి రబీ పంటనష్టంపై ఆరా తీస్తారు. ఆ తర్వాత 11.10 గంటలకు వజ్రకరూరు మండలం గూళ్యపాల్యం గ్రామానికి చేరుకొని స్థానిక రైతులతో ముఖాముఖిగా మాట్లాడతారు. ఇంతటితో కరువు బృందం పర్యటన ముగుస్తుంది.

# రైతులు నష్టపోకుండా పరిశోధనలు పెంచాలి

- శాస్త్రవేత్తలకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచన
- ఉమ్మడి జిల్లాలో 5.28 లక్షల మంది రైతులకు రూ.106 కోట్ల పీఎం కిసాన్ సొమ్ము విడుదల

**బుక్కరాయసముద్రం, జూన్18:** ఉమ్మడి జిల్లాలో రైతులు ఏటా సాగులో నష్టపోతున్నారని, రైతులు నష్టపోకుండా శాస్త్రవేత్తల పరిశోధనలు మరింత పెంచాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కేవీకే కేంద్రంలో పీఎం కిసాన్ నిధులను విడుదల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎంపీతో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో పీఎం కిసాన్ కింద 2లక్షల 76వేల మంది రైతులకు రూ.55.58 కోట్ల లబ్ది చేకూరినట్లు తెలిపారు. సత్యసాయి జిల్లాలో 2.52 లక్షల మంది రైతులు లబ్ధి పొందారన్నారు. నీటి వసతి గల ప్రాంతాల్లో పచ్చి మేత కొరకు పశుగ్రాస పంటలుగా సజ్జ , బొబ్బర్ల పంటలు వేసుకోవాలన్నారు. రూ. 50.44 కోట్ల నిధుల విడుదల అయినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి అందించిన నిధులను రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు సీఎం చంద్రబాబునాయుడు రూ.20వేలు పెట్టుబడి సాయం కింద ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులకు ఉపయోగపడే కోల్డ్ స్టోరేజీ, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ రైతుల సాగు చేసిన పంటలకు నిరంతరం శాస్త్రవేత్తలు అందుబాటలో ఉండి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కేవలం వ్యవసాయం కాకుండా, కోళ్ల, గొర్రెల పెంపకంపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరీ , జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ , ఎంపీపీ సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ , పక్కన కలెక్టర్ వినోద్‌కుమార్

# ఇంటర్ సప్లీ పరీక్షల్లో 60.69 శాతం ఉత్తీర్ణత

**అనంతపురం విద్య, జూన్ 18 :** ఇంటర్మీడియట్ సెకెండ్ ఇయర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లాలో 60.69 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ మంగళవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 4,811 మంది పరీక్షలకు హాజరు కాగా 2,920 మంది పాస్ అయ్యారని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో 1033 మందిలో 658 మంది, ఎయిడెడ్‌లో 353 మందిలో 170 మంది, వెల్ఫేర్‌లో 113 మందిలో 76 మంది, కేజీబీవీల్లో 125 మందిలో 93 మంది, మోడల్ స్కూళ్లలో 262 మందిలో 179మంది, ప్రైవేట్‌లో 2,925 మంది విద్యార్థుల్లో 1744 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని స్పష్టం చేశారు. జిల్లాలో ఆత్మకూరు జూనియర్ కాలేజీ, కణేకల్లు జూనియర్ కళాశాలలు మరో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, రెండు కేజీబీవీలు, రెండు, మోడల్ స్కూళ్లలో 100 శాతం రిజల్ట్స్ వచ్చినట్లు తెలిపారు.

### చీనీకాయలు టన్ను రూ.30 వేలు

**అనంతపురం రూరల్, జూన్ 18:** అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.30 వేలు, కనిష్ఠంగా రూ.11 వేలు, సరాసరి రూ.19 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మొత్తం 374 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

### రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటి వర్షాలు

**బుక్కరాయసముద్రం, జూన్18:** ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటి నుంచి ఓ మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్యఎన్జీ రంగా వ్యవసాయ పరిశోదన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణ స్వామి తెలిపారు. పలు చోట్ల 1.0- 2.0 మి.మీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. నైరుతి దిశగా గంటకు 6.0 కి.మీ వేగంతో గాలులులు వీస్తాయన్నారు.

- ప్రస్తుతం కురిసిన వర్షాలకు వర్షాధారంగా వేసే రైతులు అంతర పంటలు సాగు చేసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోదన కేంద్రం వాతావరణ ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి సూచించారు. ప్రస్తుతం తేలిక పాటి నేలలో నేలను వాలుకు అడ్డంగా దున్ని పంటలను విత్తుకోవాలన్నారు. అరుతడి పంటలను బోదే మరియు సాళ్ల పద్దతి లేదా ఎత్తు మడుల పద్ధతిలో విత్తుకోవాలన్నారు. తద్వారా పంటకు ఎక్కువ కాలం తేమ లభ్యమవుతుంది. పొలం గట్టుపైన కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లను అరికట్టాడానికి ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న , జొన్న, పెసర , కంది వేరుశనగ విత్తనాలను తెగళ్ల మందులతో విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు.

# కోమటికుంట్లలో టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ

**పుట్లూరు, జూన్ 18:** మండలంలోని కోమటికుంట్లలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు సోమవారం రాత్రి వైసీపీ నాయకులు కవ్వింపు చర్యల నేపథ్యంలో ఘర్షణ జరిగింది. ఈ గొడవలో టీడీపీకి చెందిన చంద్ర, సి. శ్రీనివాసులునాయుడు, పి. శ్రీనివాసులునాయుడు, వైసీపీకి చెందిన ఎరుకలయ్య గాయపడ్డారు. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టీడీపీకి చెందిన 8మంది, వైసీపీకి చెందిన 8మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ హేమాద్రి పరిశీలించారు.

### గ్రామంలో పోలీసు కవాతు

సోమవారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గాలు ఘర్షణ జరగడంతో ముందస్తుగా కోమటికుంట్ల గ్రామంలో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

# ఇష్టా రాజ్యంగా సుంకం వసూలు

- అసభ్య పదజాలంతో దూషణలు ● మార్కెట్‌లో ఆందోళనకు దిగిన రైతులు

**హిందూపురం అర్బన్, జూన్ 18:** పట్టణంలో సుంకం వసూలు దారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేపాక్షి, చిలమత్తూరు మండలాల నుంచి రైతులు తాము పండించిన కొత్తిమీరను మంగళవారం తెల్లవారుజామున స్థానిక మార్కెట్‌కు తీసు కొచ్చి హోల్‌సేల్ విక్రయానికి పెట్టారు. అయితే మంజు అనే వ్యక్తి ఇష్టా రాజ్యంగా సుంకం వసూలు చేస్తున్నాడని రైతులు ఆందోళనకు దిగారు. అదే విధంగా అసభ్య పదజాలంతో దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇంతకు ముందు కొత్తిమీర హోల్‌సేల్ వ్యాపారుల వద్ద నుంచి సుంకం రూ. 40 వసూలు చేసేవారని, ఇప్పుడు రూ. 80 నుంచి 120 వసూలు చేస్తున్నారని ఆవేదన చెందారు. అంతేగాకుండా రోడ్డుపక్కన గంపల్లో, తోపుడు బండ్లలో వ్యాపారం చేసే వారి వద్ద నుంచి రూ. 50 వరకు వసూలు చేస్తున్నారన్నారు. అడిగితే అసభ్యంగా దూషిస్తున్నాడని రైతులు వాపోయారు. మహిళా రైతుల పట్లకూడా దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు రైతులకు అండగా నిలిచారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి రైతులకు, వ్యాపారులకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల, మహిళలపట్ల అసభ్యంగా వ్యవహరిస్తున్న సుంకం వసూలు దారుడిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



అధిక సుంకం వసూలు చేస్తున్నట్లు రశీదు చూపుతున్న రైతులు

### విచారించి చర్యలు తీసుకుంటాం

రైతులు, వ్యాపారులు, మహిళల పట్ల సుంకం దారులు దురుసుగా ప్రవర్తిస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. అదే విధంగా పట్టణంలోని వ్యాపారా సముదాయాల వద్ద గెజిట్ ఏర్పాటు చేసి రైతులకు అనుకూలంగా మార్పు తీసుకొస్తాం.

- శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

## మంత్రి సత్యకుమార్‌కు శుభాకాంక్షలు



మంత్రి సత్యకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

**ధర్మవరం, జూన్ 18:** రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు మంగళవారం సాయంత్రం స్థానిక దుర్గమ్మ ఆలయంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజక వర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. సత్యకుమార్ రోడ్‌షోలో భాగంగా దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పరిటాల సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ జిల్లాకు కీలక శాఖలు రావడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు వారివారి శాఖలను సమర్థవంతంగా నడిపిస్తారన్నారు.

## క్యాన్సర్ నియంత్రణకు స్ర్కీనింగ్ ముఖ్యం

### కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్




మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

**కదిరిఅర్బన్, జూన్ 18:** క్యాన్సర్ నియంత్రణకు స్ర్కీనింగ్ ముఖ్యమంత్రి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డివిజన్ పరిధిలోని మెడికల్ అధికారులు, సీహెచ్ఓలకు మూడురోజులపాటు క్యాన్సర్ స్ర్కీనింగ్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రజల బాగుకోసం ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతుందన్నారు. సమాజంలో విద్య, వైద్యం, ఆరోగ్యం ప్రాధాన్యత సంతరించుకున్న అంశాలన్నారు. మానవాళిని పట్టి పీడిస్తున్న రుగ్మతల్లో క్యాన్సర్ ఒకటన్నారు. ప్రారంభంలోనే గుర్తించేందుకు స్ర్కీనింగ్ టెస్ట్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. మంచి ఆలోచనతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంపై పూర్తిగా అవగాహన పెంచుకుని, ప్రజలకు ఉపయోగపడాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేని శాలువా, పూలమాలతో అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ నాగేంద్రనాయక్, డివిజన్ పరిధిలోని మెడికల్ అధికారులు, సీహెచ్ఓలు పాల్గొన్నారు.

### బాధితుడికి పరామర్శ

**గాండ్లపెంట:** విద్యుదాఘాతానికి గురైన మేకల నారాయణను మంగళవారం కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పరామర్శించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు గాండ్లపెంటలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా మేకల నారాయణ విద్యుదాఘాతానికి గురయ్యాడు. తిరుపతి, వేలూరు ఆసుపత్రుల్లో చికిత్స అందించిన అనంతరం అతడిని గాండ్లపెంటకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న కందికుంట వెంకటప్రసాద్ అతడి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులతో అతడి ఆరోగ్యంపై చర్చించారు. అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నాయకులు వెంకటరమణారెడ్డి, అక్రమ్ బాషా, దాదాపీర్, మునాఫ్, సికింద్రర్, రవీంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ కాకార్ల రవీంద్రారెడ్డి తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## మృతుల కుటుంబాలకు పల్లె పరామర్శ

**నల్లమాడ, జూన్ 18:** మృతుల కుటుంబాలను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మంగళవారం పరామర్శించారు. మండలంలోని ఎర్రవంకపల్లి గ్రామానికి చెందిన చంద్రహాస్, జయరాం, గణేనాయక్ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న పల్లె రఘునాథరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి ఆయా కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## ఎంఈఓకు వినతి



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న తల్లిదండ్రులు

**తనకల్లు, జూన్ 18:** తమ పిల్లలు ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ఎంఈఓ కళ్యాణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల 3, 4, 5 తరగతి విద్యార్థులను రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఉన్నతపాఠశాలలో అధికారులు విలీనం చేశారు. ఈ నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలలోనే విద్యను అభ్యసించేలా చూడాలని తల్లిదండ్రులు ఎంఈఓను కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆమె వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు, వార్డు సభ్యుడు, టీడీపీ నాయకుడు దామోదర్ తదితరులున్నారు.

## 'నేను బడికిపోతా'పై ర్యాలీ



బుక్కపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

**బుక్కపట్నం, జూన్ 18:** మండలకేంద్రంలోని నేను బడికి పోతా కార్యక్రమంపై మంగళవారం ర్యాలీ నిర్వహించినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఇఓలు గోపాల్‌నాయక్, మోహన్‌బాబు పేర్కొన్నారు. తేరు సర్కిల్‌లో వారు మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల లోపు బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని తెలిపారు. బడి మధ్యలో మానివేసిన పిల్లలందరూ బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు, బూట్లు, బ్యాగ్‌తోపాటు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిందని, తల్లిదండ్రులుకూడా పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జగదీష్, రహీమాన్, ఉపాధ్యాయులు, ఎమ్మార్పీలు, విద్యార్థులున్నారు.

**గాండ్లపెంట:** మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో 'నేను బడికి పోతా' కార్యక్రమంపై మంగళవారం అధికారులకు ఎంఈఓ-2 శ్రీనివాసులు అవగాహన కల్పించారు. 6 సంవత్సరాలకుపైగా, 14 సంవత్సరాల లోపు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. పిల్లలు చదువుకోడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా చేయూతనిస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి తదితరులు ఉన్నారు.

# ధర్మవరం ప్రజల రుణం తీర్చుకుంటా

● మంత్రి సత్యకుమార్‌యాదవ్ ● అడుగడుగునా నీరాజనం

**ధర్మవరం, జూన్ 18:** అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉండి చెబుతున్నా ధర్మవరం ప్రజల రుణం తీర్చుకుని తీరుతా అని మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. మంత్రి పదవి చేపట్టిన తరువాత మొదటిసారిగా మంగళవారం ఆయన ధర్మవరం విచ్చేశారు. ఈ సందర్భంగా వేలాదిమంది కూటమి అభిమానులు తరలివచ్చి మంత్రికి సాదర స్వాగతంపలికారు. 11-45 గంటలకు ధర్మవరం నియోజకవర్గంలోకి అడుగుపెట్టిన ఆయన పర్యటన రాత్రి 9 గంటలకు ముగిసింది. అభిమానుల నీరాజనాల మధ్య ర్యాలీ సాగింది. మంత్రివెంట పరిటాలశ్రీరామ్, చిలకం మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తనపై చూపిన ఆదరాభిమానులకు ఏమిచ్చి రుణం తీర్చుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందంటే మీ అబిమానం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. మీ అందరికీ అందుబాటులో ఉంటూ మీ కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ మీ సేవకుడిగా ఉండటమే నా మొదటి కర్తవ్యమన్నారు. నాకు పలికిన స్వాగతం చూస్తుంటే అక్టోబరులో రావాల్సిన దీపావళి ఆరునెలలముందె వచ్చినట్టు ఉందన్నారు. ప్రతి ఇంటికి వస్తా మీ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నా సోదరుడు పరిటాలశ్రీరామ్ మరోసోదరుడు చిలకం మధుసూదన్‌రెడ్డి ముందుండి నిలబడటం మీ అందరి ఆశీర్వాదంతోనే మంత్రిగా నేను మీ ముందుకు వచ్చానన్నారు. మీ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. ధర్మవరంలో శాంతిని నెలకొల్పుతానన్నారు. ధర్మవరంలో చేనేతలు 16,500 మెజారిటీ ఇచ్చారని, మీకు సేవచేయడమే పరమావధిగా పెట్టుకుంటానన్నారు. అరాచకాలు, దోపిడీ, దౌర్జన్యాలు, అహంకారమే స్థానిక మాజీ ఎమ్మెల్యే ఓటమికి కారణమని, వాటిని కప్పిపుచ్చుకోవడానికి ఈవీఎంలపై నిందలు వేస్తున్నారన్నారు నీ గుర్రాలకోటను కూల్చి నీ అహంకారాన్ని పాతాళానికి తొక్కేస్తామన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరం ప్రజలు సున్నిత మనస్తత్వం కలవారని, వారిని ఎవరు ఇబ్బందులు పెట్టినా ఓటుతో గుణపాఠం చెప్పే నైజం వారిదన్నారు. అహంకారులకు, దౌర్జన్యపరులకు ఎప్పుడు ఇక్కడ స్థానం ఉండదని చెప్పడానికి నిదర్శనం సార్వత్రిక ఎన్నికలేనన్నారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ సహకారంతో ధర్మవరంలో శాంతిని నెలకొల్పడమే కాకుండా చేనేతలకు అన్నివిధాల అండదండలు అందిస్తామని హామీ ఇచ్చారు.

### ధర్మవరం నేలకు సాష్టాంగ నమస్కారం



ర్యాలీ ధర్మవరంలోని కదిరి గేటు వద్దగల చేనేత విగ్రహం వద్దకు చేరుకోగానే సత్యకుమార్‌యాదవ్ నేలపై సాష్టాంగ నమస్కారం చేసి, మట్టిని తీసుకుని, నుదుటిపై పెట్టుకున్నారు. ధర్మవరం పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. దీంతో అక్కడున్న అభిమానులు, కూటమి శ్రేణులు ఆశ్చర్యపోయారు.

### బత్తలపల్లిలో కూటమి శ్రేణుల ఘనస్వాగతం

**బత్తలపల్లి, జూన్ 18:** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు మండల సరిహద్దులో యర్రయపల్లి వద్ద కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. మంత్రి అయిన తరువాత తొలిసారిగా ధర్మవరానికి వెళుతుండగా యర్రయపల్లి వద్ద స్వాగతం పలికేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మంత్రి రాగానే టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, మంత్రి సత్యకూమార్‌కు పూలమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలు ఆయనకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అక్కడ నుంచి సంజీవపురం మీదుగా బత్తలపల్లికి చేరుకోగా అక్కడ కూటమి నాయకులు బాణాసంచా పేల్చి గజమాలలు వేసి సత్కరించారు. మంత్రి రాకతో నాలుగు రోడ్ల కూడలి కిక్కిరిసింది. అనంతరం పోట్లమర్రి, వేల్పుమడుగు క్రాస్ మీదుగా ధర్మవరం వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కూమార్, చల్లా శ్రీనివాసులు, నారాయణరెడ్డి, గంటాపురం జగ్గు, తాళ్ళూరి సతీష్‌చౌదరి, సురేంద్రనాయుడు, నారాయణస్వామి, రవి, కేశవరెడ్డి, మందలశ్రీనివాసులు, కేశవ, చితంబర్‌రెడ్డి, సంగాలసూరి, బీజేపీ నాయకులు కోటి సూర్యప్రకాష్‌బాబు, వీరనారప్ప పాల్గొన్నారు.



నాలుగు రోడ్లకూడలిలో సత్యకూమార్‌కు స్వాగతం పలకడానికి వచ్చిన కూటమి శ్రేణులు



త్రిచక్రవాహనంతోపాటు ముద్రలోన్‌పత్రాన్ని అందజేస్తున్న మంత్రి

### ప్రజల్లో ధైర్యం నింపేందుకు వచ్చా : మంత్రి సత్యకుమార్

**ధర్మవరంరూరల్:** ప్రజల్లో ధైర్యం నింపేందుకు తాను వచ్చానని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. ధర్మవరానికి చెందిన నారాయణస్వామి, లక్ష్మీ దంపతులు. నారాయణస్వామి దివ్యాంగుడు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం తనకు త్రిచక్రవాహనం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. విషయం తెలుసుకున్న మంత్రి సత్యకుమార్ ధర్మవరం వచ్చిన వెంటనే ఆ దంపతులను కలిశారు. తాను ప్రజల్లో ధైర్యం నింపేందుకే వచ్చానని వారికి భరోసా ఇచ్చారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ద్వారా నారాయణస్వామికి త్రిచక్ర వాహనాన్ని అందజేశారు. అదేవిధంగా అతడి భార్యకు బ్యాంకు ద్వారా రూ.50 వేల ముద్రలోన్ రుణానికి సంబంధించి మంజూరు పత్రాన్ని అందజేశారు. దీంతో ఆ దంపతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ



**హిందూపురం అర్బన్, జూన్ 18:** పరిగి మండల పరిధిలోని పెద్దిరెడ్డిపల్లిలో దండు మారెమ్మ దేవత విగ్ర హ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్థుల ఆధ్వర్యంలో మంగళ వారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా విగ్ర హ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఆల యంలో ఆల యంలో కల శారాధన, హోమాలు తదితర పూజా కార్యక్ర మాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంక రించి, అర్చనలు చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు మారుతీప్రసాద్, సోమప్ప, ప్రవీణ్‌రెడ్డి, నారా యణరెడ్డి, మూర్తి, గోవిందప్ప, నారాయణప్ప, కృష్ణారెడ్డి పెద్ద సంఖ్యలో గ్రామస్థులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.





మొక్క, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్, ఎస్పీ

### మంత్రిని కలిసిన కలెక్టర్, ఎస్పీ

**ధర్మవరం, జూన్ 18:** మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్మవరం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంత్రిని కలిసి, కలెక్టర్ మొక్క, ఎస్పీ పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పథకాల అమలు, శాంతిభద్రతలపై చర్చించారు.

# ఆగిన అభివృద్ధి

### కూటమి అధికారంతో కదిరి వాసుల్లో ఆశలు

**కదిరి, జూన్ 18:** నియోజకవర్గంలో అభివృద్ధి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. అభివృద్ధి అటకెక్కింది. ఖాద్రీశుడి ఆలయ కోనేరు, ప్రభుత్వ ఆసుపత్రి, బైపాస్‌రోడ్డు పనులు అడుగు ముందుకు పడట్లేదు. వైసీపీ పాలన మొత్తం ఇలానే గడిచిపోయింది. ప్రస్తుతం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడంతో అభివృద్ధి పనులకు మోక్షం లభిస్తుందన్న ఆశలు కదిరి వాసుల్లో రేగాయి. కదిరి-ఎన్పీకుంట రహదారిని మూడునెలల్లో పూర్తి చేస్తామని ఎమ్మెల్యేగా ఎంపికైన కందికుంట వెంకటప్రసాద్ ఇప్పటికే మాట ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న భవనాలను కూల్చి కొత్త భవనాలు నిర్మిస్తున్నారు. దీంతో రోగులకు గదులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. కోనేరును కూడా త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. బైపాస్‌రోడ్డు పనులు పూర్తి చేసి, ట్రాఫిక్ సమస్యను నియంత్రించాల్సి ఉందంటున్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు తప్పని ఇబ్బందులు

మూడేళ్ల క్రితం రూ.18కోట్ల నిధులతో ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన భవనాల నిర్మాణాలను వైసీపీ మాజీ ఎమ్మెల్యే సిద్దారెడ్డి అప్పట్లో ప్రారంభించారు. అప్పటినుంచి ఆ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఉన్న భవనాలను కూల్చివేసి, వాటి స్థానంలో తిరిగి నూతన భవనాల నిర్మాణాలు ప్రారంభించడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ల్యాబ్ సౌకర్యం లేక అగచాట్లు పడుతున్నారు. వైద్యులు కూడా చిన్నపాటి గదుల్లో చికిత్సలు నిర్వహించాల్సి వస్తోంది. దీంతో రోగులకు తీవ్ర అసౌకర్యం నెలకొంది. పనులు పూర్తయితే రోగులకు సౌకర్యంగా ఉంటుంది.



అర్ధంతరంగా ఆగిన ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణం



నిర్మాణ పనులు పూర్తికాని కోనేరు

### కోనేటి స్నానం లేక మూడేళ్లు..

శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునే ముందు భక్తులు పడమర గోపురం వెనుక ఉన్న భృగుతీర్థంలో (కోనేరు) స్నానమాచరిస్తారు. అయితే మరమ్మతుల కారణంగా మూడేళ్లుగా భక్తులకు మునక కరువైంది. బ్రహోత్సవాల సమయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసి, స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్నారే తప్ప, భక్తులు కోనేరులో స్నానం చేసే ప్రాప్తం కలుగలేదు. దీని కోసం ప్రతి సంవత్సరం భక్తులు ఎదురు చూస్తున్నారు. వెంటనే పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

### బైపాస్ ప్రారంభమెన్నడో..?

టీడీపీ పాలనలో బైపాస్ నిర్మాణానికి అనుమతులొచ్చాయి. వైసీపీ పాలనలో నిర్మాణాలు ప్రారంభించారు. ఐదేళ్లు పూర్తి అయినా పూర్తి కాలేదు. ఇది పూర్తయితే పులివెందల, అనంతపురం, హిందూపురం, మదనపల్లి నాలుగు రోడ్ల లింక్ ఏర్పడుతుంది. పట్టణంలో భారీ వాహనాలు వెళ్లకుండా నేరుగా బైపాస్‌లో వెళ్లేందుకు అవకాశముంటుంది. ఈ భూసేకరణ పనులు పూర్తికాకపోవడంతో బైపాస్‌రోడ్డు నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. ఇది పూర్తి చేస్తే ఎంతో మంది వాహనాదారులు, ప్రయాణీకులకు సౌకర్యంగా ఉంటుంది. మదనపల్లి రోడ్డుకు సమీపంలో కొంతభాగం భూసేకరణ జరగాల్సి ఉంది. అది పూర్తి అయితే ఈరోడ్డు నిర్మాణం పూర్తి అయినట్లే. కుటాగుళ్ల వద్ద కొత్త మట్టి పని మిగిలి ఉంది. ఈరెండు పనులు పూర్తి అయితే ఈ రోడ్డు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. దీనిపై ఎమ్మెల్యే దృష్టి సారించి త్వరగా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### అభ్యర్థులు తుది అకౌంట్స్

# సమర్పించాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు




మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

**పుట్టపర్తి రూరల్, జూన్ 18:** అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు పోటీచేసిన అభ్యర్థులు తమ తుది అకౌంట్స్‌ను వ్యయపరిశీలకులకు సమర్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలోని స్పందన సమావేశమందిరంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పోటీచేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై కలెక్టర్ వివిధ పార్టీల అభ్యర్థుల ఏజెంట్లతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో చివరి అంకం మిగిలిఉందన్నారు. ఎన్నికల్లో పోటీచేసిన ప్రతిఒక్క అభ్యర్థి వ్యయఖర్చులకు సంబంధించిన తుది అకౌంట్స్‌ను ఎన్నికల వ్యయపరిశీలకులకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈనెల చివరి వారంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ముగ్గురు పరిశీలకులు జిల్లాకు రానున్నారన్నారు. వారంరోజులపాటు జిల్లాలో ఉండి సదరు అభ్యర్థుల అకౌంట్స్ వివరాల పరిశీలనను పూర్తి చేస్తారన్నారు.

### అధికారుల పనితీరు స్ఫూర్తిదాయకం

అధికారులు, సిబ్బంది కృషి సహకారంతో సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమష్టి కృషిచేసి జిల్లాను ప్రగతిపథంలో నడిపించాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ సిబ్బంది కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. సమావేశంలో డీఆర్ఓ కొండయ్య, స్టాటిస్టిక్స్ మానిటరింగ్ కమిటీ అధికారి బాలాజీ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

### గంగమ్మకు మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు

**నల్లమాడ, జూన్ 18:** మండలంలోని కొండ్రవారిపల్లి గ్రామంలో గంగమ్మకు టీడీపీ నాయకులు మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డి గెలవాలని మొక్కున్నామని, వారు గెలవడంతో గంగమ్మకు జ్యోతులు, బోనాలను సమర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బుట్టి నాగభూషణ నాయుడు, వెంకటరామిరెడ్డి, క్రిష్టప్ప, గంగులప్ప, నగేష్, ఎన్. గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

### నేడు సబ్సిడీ విత్తనకాయలు పంపిణీ

**ఓబుళదేవరచెరువు, జూన్ 18:** మండలంలోని తంగేడుకుంటలో శోత్రియం సాగురైతులకు బుధవారం సబ్సిడీ విత్తనకాయలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ ఇలియాజ్ అహమ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరవుతున్నట్లు మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర తెలిపారు.

### నిందితుడి పట్టివేత

**కొత్తచెరువు, జూన్ 18:** మండలకేంద్రంలోని బండ్లపల్లి, పోతులకుంట పంచాయతీ పరిధిలో కేబుల్‌వైర్ చోరీకి పాల్పడుతున్న నారాయణరెడ్డిని రైతులు మంగళవారం వలపన్ని పట్టుకున్నారు. పోతులకుంట గ్రామానికి చెందిన నారాయణరెడ్డి బోర్‌వెల్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే విలాసవంతమైన జీవితం కోసం వ్యవసాయ బావుల మోటార్లకు అమర్చిన కేబుల్‌వైర్‌ను చోరీ చేస్తుండేవాడు. అందులో భాగంగా బండ్లపల్లి సమీపంలోని వ్యవసాయ బావుల వద్ద బోర్లకు అమర్చిన కేబుల్‌వైర్‌ను మంగళవారం చోరీచేస్తూ రైతులకు పట్టుబడ్డారు. రైతులు అతడిని పోలీసులకు అప్పగించారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


### వాటర్ ప్యూరిఫయర్ అందజేత

**ధర్మవరం,జూన్ 18:** పట్టణంలోని మాతాశిశు సంరక్షణ కేంద్ర ఎంసీహెచ్ ఆసుపత్రికి దాతలు పొందుతల పనేని, గుడిపాటి సురేశ్ వాటర్‌ప్యూరిఫయర్‌ను అందజేశారు. సత్యకుమార్‌యాదవ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ధర్మవరంలో నూతనంగా నిర్మించిన మాతాశిశుసంరక్షణ కేంద్ర ఎంసీహెచ్ ఆసుపత్రికి వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేసినట్లు దాతలు పేర్కొన్నారు.

## చరిత్రపై చెరగని సంతకం

### పదో తరగతి పాఠ్యపుస్తకంపై బుగ్గరామలింగేశ్వరుడి ఆలయ ముఖచిత్రం

**తాడిపత్రిటౌన్:** పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయానికి మరో ఘనత దక్కింది. పదో తరగతికి కొత్త గా వచ్చిన సోషియల్ సబ్జెక్టులో భాగంగా హిస్టరీ పాఠ్యపుస్తకం ముఖ చిత్రంపై తాడిపత్రిలోని ప్రసి ద్ధ శైవక్షేత్రమైన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ గాలిగోపురం ముఖచిత్రాన్ని రాష్ట్ర ప్రభు త్వం ముద్రించింది. నేటితరం విద్యార్థులకు అలనాటి ఆలయాల చరిత్ర, శిల్పకళ సంపద గురించి తెలియజేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈ పని చేసినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ ఆలయంలో స్వామివారి లింగం చుట్టూ ఎల్లప్పుడూ జలధార వస్తుంటుంది. ఇక్కడి స్తంభాలను తాకి తే సప్త స్వరాలు పలుకుతాయనేది నానుడి.




పాఠ్యపుస్తకంపై ముద్రించిన గాలిగోపురం ముఖచిత్రం

## ఘనంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన దండు మారెమ్మ విగ్రహం

హిందూపురం అర్బన్, జూన్ 18: పరిగి మండల పరిధిలోని పెద్దిరెడ్డిపల్లిలో దండు మారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్థుల ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆలయంలో కలశారాధన, హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, అర్చనలు చేశారు. టీడీపీ నాయకులు మారుతీ ప్రసాద్, సోమప్ప, ప్రవీణ్‌రెడ్డి, నారా యణరెడ్డి, మూర్తి, గోవిందప్ప, నారాయణప్ప, కృష్ణారెడ్డి పెద్ద సంఖ్యలో గ్రామస్థులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

## అభ్యర్థుల ఖర్చుల వివరాలు సమర్పించాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు


పుట్టపర్తిరూరల్, జూన్ 18: అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు పోటీచేసిన అభ్యర్థులు తమ తుది అకౌంట్స్‌ను వ్యయపరిశీలకులకు సమర్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలోని స్పందన సమావేశమందిరంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పోటీచేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై కలెక్టర్ వివిధ పార్టీల అభ్యర్థుల ఏజెంట్లతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో చివరి అంకం మిగిలిఉందన్నారు. ఎన్నికల్లో పోటీచేసిన ప్రతిఒక్క అభ్యర్థి వ్యయఖర్చులకు సంబంధించిన తుది అకౌంట్స్‌ను ఎన్నికల వ్యయపరిశీలకులకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈనెల చివరి వారంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ముగ్గురు పరిశీలకులు జిల్లాకు రానున్నారన్నారు. వారంరోజులపాటు జిల్లాలో ఉండి అభ్యర్థుల అకౌంట్స్ వివరాల పరిశీలన పూర్తిచేస్తారన్నారు.

### ఎన్నికల సిబ్బంది పనితీరు స్ఫూర్తిదాయకం

అధికారులు, సిబ్బంది కృషి సహకారంతో సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమష్టి కృషిచేసి జిల్లాను ప్రగతిపథంలో నడిపించాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ సిబ్బంది కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. డీఆర్‌ఓ కొండయ్య, స్టాటిస్టిక్స్ మానిటరింగ్ కమిటీ అధికారి బాలాజీ పాల్గొన్నారు.

## చరిత్రపై చెరగని సంతకం

పదో తరగతి పాఠ్యపుస్తకంపై బుగ్గరామలింగేశ్వరుడి ఆలయ ముఖచిత్రం




పాఠ్యపుస్తకంపై ముద్రించిన గాలిగోపురం ముఖచిత్రం

తాడిపత్రి టౌన్, జూన్ 18 : పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయానికి మరో ఘనత దక్కింది. పదో తరగతికి కొత్త గా వచ్చిన సోషియల్ సబ్జెక్టులో భాగంగా హిస్టరీ పాఠ్యపుస్తకం ముఖ చిత్రంపై తాడిపత్రిలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ గాలిగోపురం ముఖ చిత్రాన్ని రాష్ట్ర ప్రభు త్వం ముద్రించింది. నేటితరం విద్యార్థులకు అలనాటి ఆలయాల చరిత్ర, శిల్పకళ సంపద గురించి తెలియజేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈ పని చేసినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ ఆలయంలో స్వామివారి లింగం చుట్టూ ఎల్లప్పుడూ జలధార వస్తుంటుంది. ఇక్కడి స్తంభాలను తాకితే సప్తస్వరాలు పలుకుతాయనేది నానుడి.

## రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు
- అధికారులతో సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, జూన్ 18: రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికారులకు సూచించారు. రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో రైతు ల అవసరం మేరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సర్వీసులను ఏర్పాటు చేయాలన్నారు. ఏ ఒక్క రైతు వద్ద నుంచే ఫిర్యాదు రాకూడదని, అందరం కలిసి రైతులకు అండగా ఉందామన్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులకు అవగాహన కల్పించాలని, రైతులు నష్టపోకుండా ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు అందించాలన్నారు. అలాగే నగర పంచాయతీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామన్నారు. ప్రస్తుతం నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదని, ఎక్కడ చూసినా చెత్తా చెదారం కనిపి స్తోందన్నారు. ప్రభుత్వం మారిందని, అధికారుల్లో మార్పు రావాలన్నారు. ఈ సంద ర్భంగా వ్యవసాయాధి కారులు మాట్లాడుతూ... నియోజకవర్గంలో వర్షాలు పుష్క లంగా కురుస్తుండటంతో 1300 క్వింటాళ్ల విత్తన వేరుశనగ అవసరం అవుతుందని ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు తెలిపారు. అనంతరం రెవిన్యూ, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, విద్యుత్ శాఖ డీఈ భూపతి, ఏడీ సుబ్రహ్మణ్యం ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు

మడకశిరటౌన్: ప్రతి విద్యార్థి అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసు కుంటూ కష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. వారు మంగళవారం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పుస్తకాలు, బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. ప్రభుత్వం తరపున విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసభాస్కర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పురంలో భారీ వర్షం



హిందూపురంలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

హిందూపురం అర్బన్, జూన్ 18: రెండు రోజులుగా సాయంత్రం అయితే చాలు పట్టణంలో వర్షం దంచిపెడుతోంది. పగలంతా ఎండ, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడినా... సాయంత్రానికి వాతావరణం చల్లగా మారిపోతుంది. అర్ధరాత్రి వరకు భారీగా వర్షం కురుస్తోంది. దీంతో ఎగువ నుంచి వచ్చే నీరు లోతట్టు ప్రాంతాల్లో నిలిచి పోతోంది. ప్రజల రాకపోకలకు తీవ్రం ఇబ్బందులు కలుగుతోంది. పలు చోట్ల రోడ్లపై వరపు నీరు నిలిచింది. అలాగే డ్రైన్‌లు నిండిపోయి మురుగునీరు రోడ్లపైకి చేరు తోంది. పట్టణ పరిధిలోని పల్లా రెసిడెన్సీ ముందు భాగంలో పెద్ద సంఖ్యలో వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో రోడ్డు ఎక్కడ సాఫీగా ఉందో, ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రెండు రోజులుగా హిందూపురం ప్రాంతంలో భారీగా వర్షం కురుస్తోంది. సోమవారం 54.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తూనే ఉంది.

### మడకశిరలో...

మడకశిర రూరల్/ టౌన్: మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం 4 గంట ల నుంచి రెండు గంటల పాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. చెక్‌డ్యాంలలో నీరు చేరింది. ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసుకోవడానికి మంచి అదును కావడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే సాగుచేసిన పంటలు ఈ వర్షంతో కళకళలాడుతున్నాయి. అలాగే మడకశిర పట్టణంలో పలు రహదారులపై వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొత్త మసీదు, పావగడ రోడ్డు, మధుగిరిరోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరింది. చెత్తాచెదారం పేరుకుపోయి డ్రైనేజీలు నిండడంతో... వర్షపు నీటితో మురుగు చేరి రోడ్లపైకి వచ్చింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



మడకశిరలో కురుస్తున్న వర్షం

## మంత్రి సవితను కలిసిన గోరంట్ల నాయకులు



మంత్రి సవితతో టీడీపీ గోరంట్ల నాయకులు

గోరంట్ల, జూన్ 18: బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖమంత్రి సవితకు టీడీపీ హిందూపురం పార్లమెంటు కార్యదర్శి దేవ నరసింహప్ప యాదవ్ మంగళవారం పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు. నరసింహప్ప ఆధ్వర్యంలో మల్లాపల్లి పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ నాయకులు విజయవాడకు వెళ్లి మంత్రిని కలిశారు. టీడీపీ నాయకులు ఫయాజ్‌బాషా, గంగిరెడ్డి, ఎర్రగంగిరెడ్డి, రామాంజనేయరెడ్డి, ప్రభాకర్, నరసరాం, ప్రభాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## రత్నగిరిలో విద్యార్థుల ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రొళ్ల, జూన్ 18: రొళ్ల మండలంలోని రత్నగిరిలో మంగళవారం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం నేను బడికిపోతా అనే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించాలని వారు ఈ సందర్భంగా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్, ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ల సంఘం తాలూకా కమిటీ ఎంపిక



ఎన్నికైన కాంట్రాక్టర్ల సంఘం డైరెక్టర్లు, పదాధికారులు

పావగడ, జూన్18: తాలుకాలోని క్లాస్‌వన్ కాంట్రాక్టర్ల సంఘం కమిటీని మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా ఎ శంకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా పాలేగర లోకేష్, కార్యదర్శిగా గంగ ప్ప, కోశాధికారిగా బాలనాయకా ఎంపిక య్యారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి కమిటీని ఎన్నికుంటామని అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నూతనంగా ఎంపికైన డైరెక్టర్లు, పదాధికారులకు పలువురు అభినందనలు తెలిపారు.

## క్రికెట్ పోటీల్లో అనంత, చిత్తూరు విజయం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18: సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో అనంతపురం, చిత్తూరు జట్లు విజయం సాధించాయి. మంగళవారం స్థానిక అనంత క్రీడా గ్రామం ఆర్డీటీ స్టేడియంలో అంతర్-23 ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు కొనసాగాయి. కర్నూలు, అనంతపురం జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 38.1 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో యోగానంద 55 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 48 ఓవర్లలో 161 పరుగులకే ఆలౌట్ అయ్యింది. అనంతపురం 11 పరుగుల తేడాతో సాధించిన విజయంలో అర్జున్ టెండ్యూకార్ 50 పరుగులు చేసి మూడు వికెట్లు తీసి ప్రతిభచూపాడు. మరో మ్యాచ్‌లో నెల్లూరు, చిత్తూరు జట్లు పోటీ పడగా.... మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 274 పరుగులు చేసింది. ధరణికుమార్ ఐదు వికెట్లు తీశాడు. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 49 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 278 పరుగులు చేసి గెలుపొందింది. చిత్తూరు బ్యాటర్ రుషిల్ రెడ్డి 71 పరుగులు, ధరణికుమార్ 73 పరుగులు, శశాంక్‌శ్రీవాస్తవ్ 75 పరుగులు సాధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సెలెక్టర్లు శ్రీహరి, వెంకటేష్, నాగినికుమార్, విజయశేఖర్ పాల్గొన్నారు.

## నేడు సోలార్‌కు భూములిచ్చిన రైతుల సమావేశం

పావగడ, జూన్18: కర్ణాటక సోలార్‌పవర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్‌కు భూములిచ్చిన రైతులకు భూముల ధరల పెంపకంపై బుధవారం ర్యాప్టా గ్రామ పంచాయతీలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వరదరాజు మంగళవారం ప్రకటనలో తెలిపా రు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని మధ్యాహ్నం 3గంటలకు గ్రామ పంచాయతీ కార్యాల యంలో నిర్వహిస్తామన్నారు. ర్యాప్టా ప్రాంతంలో సోలార్ పార్కులకు భూములిచ్చిన రైతులు స్వయంగా పాల్గొని తమ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. రెండు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన 4,336 ఎకరాల భూములను సేకరించడంపై ఈ సభలో చర్చించనున్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



పట్టణంలో అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రాజు

మడకశిర, జూన్ 18: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పే స్వామి మంగళవారం పట్టణంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా కూరగాయల మార్కెట్‌ను సందర్శించి, వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మడకశిర ప్రభుతాస్పత్రిని, అక్కడ ఆగిపోయిన వంద పడకల ఆస్పత్రి భవనాలను పరిశీలించారు. వైద్యాధికారులతో సమావేశమై ఆస్పత్రిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం మార్కెట్ యార్డులో ఉన్న పాల డెయిరీని పరిశీలించి, అది మూతపడటానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే రైతుల నుంచి పాలసేకరణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం నగర పంచాయతీ పరిధిలోని వార్డులలో పర్యటించారు. అపరిశుభ్రత పట్ల నగర పంచాయతీ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వారి వెంట టీడీపీ నాయకులు డాక్టర్ శ్రీనివాసమూర్తి, భక్తర్, రాజా, పట్టణ అధ్యక్షుడు మనోహర్ తదితరులు ఉన్నారు.

## బాల్య వివాహాలను రూపుమాపుదాం

సబ్ కలెక్టర్ అపూర్వ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పెనుకొండ టౌన్, జూన్ 18: బాల్యవివాహాలు లేని రెవెన్యూ డివిజన్‌గా పెనుకొండను తీర్చిదిద్దుదామని, అందుకు అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆయన డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పెనుకొండ సబ్ డివిజన్ పరిధిలోని ఆయా శాఖల అధికారులు ప్రజలకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఏ ఒక్క గ్రామంలోనూ బాల్య వివాహాలు జరుగకుండా చూడాలని ఆయన తెలిపారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీడీపీఓలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## పాత కక్షలతోనే హత్య: డీఎస్పీ

తాడిపత్రిటౌన్, జూన్ 18: పట్టణానికి చెందిన యల్లనూరు లాల్‌బాషా హత్యకు పాతకక్షలే కారణమని తాడిపత్రి డీఎస్పీ జనార్దన్ నాయుడు తెలిపారు. ఈ కేసులో నిందితుడు షేక్ హాజీ మలంగ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. లాల్‌బాషాకు హాజీ మలంగ్‌కు మధ్య నందలపాడులో ఆధిపత్య పోరు నడుస్తోందని డీఎస్పీ తెలిపారు. లాల్‌బాషా సమీప బంధువు యల్లనూరు మహమ్మద్‌పై హాజీ మలంగ్, అతని స్నేహితులు 2021లో హత్యాయత్నం చేశారని, ఈ మేరకు కేసు నమోదైందని డీఎస్పీ తెలిపారు. ఆ సమయంలో హాజీ మలంగ్‌పై రౌడీ షీట్ తెరిచామని తెలిపారు. మద్యం మత్తులో ఉన్న లాల్‌బాషా ఈ నెల 16న హాజీ మలంగ్‌ను చంపుతానని బెదిరించాడని దీంతో లాల్‌బాషాను చంపాలని మలంగ్ నిర్ణయించుకున్నాడని తెలిపారు. లాల్‌బాషా కదలికలపై నిఘా వేసి, ఈనెల 17న అర్ధరాత్రి తన ఇంటిపై నిద్రిస్తుండగా పారతో దాడి చేసి చంపేశాడని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు.



## జోరందుకున్న పంటల సాగు

- మడకశిర నియోజకవర్గంలో సమృద్ధిగా వర్షాలు
- ఇప్పటికే 1700 హెక్టార్లలో వేరుశనగ విత్తినట్లు అంచనా



వేరుశనగ సాగు చేస్తున్న రైతు

మడకశిర, జూన్ 18: ఖరీఫ్ సాగుకు అనుకూలంగా వరుణుడు కరుణించడంతో నియోజకవర్గంలో వర్షాలు సమృద్ధిగా పడ్డాయి. దీంతో రైతులు పంటలు సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. అధికంగా వేరుశనగ సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. గత యేడు వర్షాలు కురవకపోవడంతో పంటలు సాగుచేయలేక ఇబ్బందులు పడిన రైతులు ఈ యేడు ఖరీఫ్‌లో ముందస్తుగానే సాగును ప్రారంభించారు. నియోజకవర్గంలో అధికారిక లెక్కల ప్రకారం ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 28 వేల హెక్టార్లు. గత సంవత్సరం వర్షాలు కు రవక పోవడంతో 60 శాతం కూడా పంటలు సాగుకాలేదు. ఈ సంవత్సరం ఇప్పటికే నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 1700 హెక్టార్లలో వేరుశనగ విత్తనం వేసినట్లు తెలుస్తోంది. మిగిలిన రైతులు కూడా పంటల సాగుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఈయేడు పూర్తి స్థాయిలో పంటలు సాగు అవుతాయని రైతులు అం టున్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతంమైన మడకశిర నియోజకవర్గంలో రైతులు ఖరీఫ్‌లో సాగు చేసే వేరుశనగ పంటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. దీంతో గత యేడు సాగు చేయని రైతులు కూడా ఈ సంవత్సరం అయినా పంటలు పండితే తమ కష్టాలు గట్టెక్కుతాయన్న గంపెడాశతో అప్పులు చేసి పంటల సాగుకు సిద్ధం అవుతున్నారు.

### పెరిగిన పెట్టుబడి

గత యేడు కంటే ఈ యేడు పంటల సాగుకు పెట్టుబడి బాగా పెరిగి పోయిం ది. కాడెద్దులతో పాటు రైతు విత్తనాలు వేసేందుకు వెళితే ఎకరాకు రూ.2600 తీసుకుంటున్నారు. అలాగే కిలో విత్తనాలు విత్తేందుకు ఓ మనిషికి రూ. 40నుంచి రూ.50 వరకు తీసుకుంటున్నారు. దీంతో పాలు మిగిలిన పెట్టుబడి వ్యయం కలిపితే ఎకారాలో వేరుశనగ సాగు చేసేందుకు రూ. 12 వేలదాకా ఖర్చు వస్తోంది. అయితే ఎంతో కష్టపడి, అప్పులు చేసి సాగు చేసిన పంటలు పది సంవత్సరాలు గా దెబ్బతింటూనే ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమ అప్పుల పాలవుతున్నామని అంటున్నారు. అయినా పొలాన్ని బీడుగా వదల లేక, ఆశ చావక తిరిగి అప్పులు చేసి పంటసాగు చేస్తున్నామని అంటున్నారు. ఈ సంవత్సరం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సి డీ వేరుశనగ విత్తన కాయలను 16040 క్వింటాళ్లు కేటాయించారు. రెండో మారు అదనంగా 2500 క్వింటాళ్లు కేటాయించినట్లు సంబంధిత శాఖ అధికారి తెలియ చేశారు. ఇప్పటి వరకు 18,738 మంది రైతులకు 16075.49 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరమైనా పంటలు సమృద్ధిగా పండి తాము కష్టాల నుంచి గట్టెక్కుతామన్న ఆశాభావాన్ని పలవురు రైతులు వ్యక్తం చేస్తున్నారు.